హింసను అరికట్టాలి.. శాంతిని నెలకొల్పాలి

- మణిపూర్ ఘటనను నిరసిస్తూ క్రైస్తవుల శాంతి ర్యాలీ
- నగరంలో 82 క్రైస్తవ సంఘాల ప్రాతినిధ్యం



శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలి వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు

శ్రీకాకుళం కల్చరల్:

మణిపూర్ రాష్ట్రంలో చెలరేగుతున్న హింసను అరికట్టి శాంతిని నెలకొల్పాలని కోరుతూ శ్రీకాకుళం నగరంలోని 82 క్రైస్తవ సంఘాలు, రోమన్ క్యాథలిక్స్‌తో కలిపి సుమారు 1500 మంది ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి సూర్యమహల్ కూడలి, జీటీ రోడ్డు మీదుగా ఏడు రోడ్ల కూడలికి చేరి అక్కడి నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు వెళ్లారు. అక్కడి మోకాళ్లపై మోకరిల్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న దారుణ హింసాకాండను అరికట్టాలని కోరారు. ప్రతిఒక్కరూ శాంతియుతంగా ఉండాలన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా క్రైస్తవ సంక్షేమ సంఘం అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ జె.జీవన్, సెక్రటరీ ప్రేమకుమార్, జిల్లా క్రైస్తవ సంక్షేమ జనరల్ సెక్రటరీ డీఎల్‌బీఎల్ కుమార్, రోమన్ క్యాథలిక్ బిషప్ రాయల విజయ్‌కుమార్, బిషప్ శామ్యూల్ మెజేస్, బిషప్ కె.విశ్వాసరావు, బిషప్ కె.సుజ్ఞానరావు, రెవ.సతీష్‌బాబు, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ అనిష్ తదితరులు పాల్గొన్నారు.



బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



జీటీ రోడ్డులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

ప్రతిపక్షాల విషప్రచారం నమ్మవద్దు



ప్రజలకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుల వారీగా ప్రభుత్వ పథకాలు వర్తించిన వివరాలతో కూడిన బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించిన తెలుగు దేశం నేతలు ఇప్పుడు ప్రజాసమస్యలు, ప్రాజెక్టులు అంటూ విమర్శించటం వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని చెప్పారు. జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ అనుకూలమైన వారికి మాత్రమే పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమల్లోకి వచ్చాక, ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు.సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన చేరువైందన్నారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారున. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర ప్రయోజనాలు కంటే చంద్రబాబు ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మురళీధర్‌బాబా, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు నక్క కృష్ణమూర్తి, కె.వి.వి.సత్యనారాయణ, హౌ సింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, పీఆర్ ఏఈ సూర్యచంద్ర, ఏఓ సురేష్, ఉపాధి ఏపీవో శోభాదేవి, నాయకులు బెందు రామారావు, బగ్గు రాజారావు, కొత్తకోట సూర్యారావు, బోర సాయిరాంరెడ్డి, నాయకులు నేతింటి సత్యనారాయణ, మెండ లక్ష్మీనారాయణ, సూరపు శివ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



లావేరు: శతకాల పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి



రణస్థలం: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

లావేరు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని లావేరు శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వేమన, సుమతి, భాస్కర శతకాల పఠనంపై పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన బి.శ్యామ్, ఎస్.రాము, ఆర్.లలితలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు గడ్డెయ్య పాల్గొన్నారు.

రణస్థలం: విద్యార్థులు చదువుతోపాటు ఉన్నత వ్యక్తిత్వం అలవార్చుకోవాలని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. దినపత్రికల పఠనంపై అవగాహన కల్పించారు. శీర్షికల పోటీల్లో విజేతగా నిలిచిన దినేష్‌కుమార్‌కు బహుమతి అందజేశారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పద్యాలు, కథల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మలిపెద్ది చంద్రశేఖర్‌రావు, సహాయకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: చదవటం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మంగయ్యనాయుడు సేవలు వెలకట్టలేనివి



సంస్మరణ సభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

లావేరు: మురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డు హెచ్‌ఎం తేనెల మంగయ్యనాయుడు ఈ నెల 19న మృతి చెందారు. ఆదివారం మురపాకలో సంస్మరణ సభ నిర్వహించారు. లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై మంగయ్యనాయుడు సేవలు కొనియాడారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రణస్థలం: రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆగస్టు 1 విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రణస్థలం, జె.ఆర్.పురం, బావరాజుపాలెం, బండిపాలెం, నగరపాలెం, కంబాలపేట, సంచాం తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తృణ ధాన్యాలతో పౌష్టికాహార వంటల పోటీలు



విజేతలతో పోటీల నిర్వాహకులు



రాగులతో తయారు చేసిన కేక్

శ్రీకాకుళం అర్బన్: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ ఇండియా, రోటరీ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం, మెప్మా ఆధ్వర్యంలో సంయుక్త నిర్వహణలో ఆదివారం శ్రీకాకుళంలోని రైతుబజారు కూడలి వద్ద జగనన్న మహిళా మార్ట్‌లో తృణధాన్యాలతో పౌష్టికాహార వంటల పోటీలు నిర్వహించారు. మెప్మా పీడీ కిరణ్‌కుమార్, కోవే ఏపీ చాప్టర్ అధ్యక్షురాలు రాధికల పర్యవేక్షణలో ఈ వంటల పోటీలు జరిగాయి. ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి పాల్గొని మహిళలని అభినందించారు. పాల్గొన్న ప్రతిఒక్కరికి భాగస్వామ్య పత్రాలను అందజేశారు. విజేతలకు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. లక్ష్మి తయారు చేసిన చాక్లెట్ రాగి కేక్‌కు మొదటి స్థానం, దేవకీరాణి చేసిన మిల్లెట్స్ బర్ఫీకి రెండో స్థానం, ఝరీ చేసిన పైనాపిల్ రెసిపీకి మూడవ స్థానం లభించాయి. సీఎంఆర్ షాపింగ్ మాల్ సౌజన్యంతో కోవె ఆంధ్ర ప్రెసిడెంట్ రాధిక, చెఫ్ రాజు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పి.సుగుణ, యోగా గురువు తంగి స్వాతి, విజయలక్ష్మి, మీనా, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో మొదటి స్థానమే లక్ష్యం



సంతవురిటిలో మొక్కలు నాటుతున్న పీడీ చిట్టిరాజు

జి.సిగడాం: గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమర్థంగా పనులు సమర్థంగా నిర్వహించి ఉపాధి హామీ పథకం అమల్లో రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాను మొదటి స్థానంలో నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు తెలిపారు. ఆదివారం గేదెలపేట, పాలఖండ్యాం, సంతవురిటి గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులంతా మొక్కలు నాటి పెంచాలన్నారు. తోటపల్లి, మడ్డువలస ప్రధాన కాలువలో పూడికలను వేతనదారుల ద్వారా తొలగించడంతో పొలాలకు సక్రమంగా సాగునీరు అందుతుందన్నారు. జి.సిగడాం మండలంలో 4500 మంది వేతనదారులతో సుమారు 80 కిలోమీటర్ల దూరంలో పనులు చేయించామన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సంలో రూ.584 కోట్లతో ఉపాధి పనుల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ప్రతి వేతనదారుడికి కనీసం రూ.272 వచ్చేలా పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధారబోయిన రెయియ్య, గేదెల మల్లిబాబు, గేదెల నారాయణరావు, నాయకులు ధారబోయిన ధర్మారావు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, టీఏలు ఎస్.లక్ష్మణరావు, కీర్తి గణపతి, వై.వైకుంఠరావు, జె.మన్మధరావు, బి.రాంబాబు, ఎఫ్ఏ వాండ్రంగి రామ్‌జీ, పి.నర్సింగరావు, దకర శివకుమార్ పాల్గొన్నారు.

13న అయ్యప్పల రక్తదాన శిబిరం



మాట్లాడుతున్న బరాటం సంతోష్

శ్రీకాకుళం అర్బన్: శ్రీధర్మ శాస్త సన్నిధానం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 13న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బరాటం సంతోష్ తెలిపారు. నగరంలో ఆదివారం శ్రీ ధర్మశాస్త సన్నిధానం ట్రస్ట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ కూడలి వద్ద రక్తదాన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మానవసేవే మాధవసేవ అనే నినాదంతో సుమారు వెయ్యి యూనిట్ల రక్తాన్ని సేకరించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని అయ్యప్ప భక్తులంతా పాల్గొని రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆధ్యాత్మిక చింతన కలిగిన ప్రతి భక్తుడు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు ఉమాదీక్షిత్, రంగాభట్ల శ్రీను గురుస్వామి, గణేష్ గురూజీ, చందుబాబు, గుమ్మా నగేష్, ట్రాఫిక్ జాం శ్రీను స్వామి, అనిల్ శర్మ, పాపారావు గురుస్వామి, అప్పన్న, ప్రశాంత్, శ్రీనివాస గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో అధిక శ్రావణ సందడి

- కిటకిటలాడిన అరసవల్లి
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు



ఉచిత ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో అధిక శ్రావణ ఆదివారం సందర్భంగా ప్రత్యేక సందడి కనిపించింది. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కేశఖండన శాలలో భక్తులు తలనీలాలను సమర్పించుకున్నారు. పలువురు మహిళలు పుష్కరిణి చెంతనున్న రావిచెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి దీపారాధనలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక, విశిష్ట దర్శనాల మార్గాల్లో ఆదిత్యునికి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామి దర్శనాలతో పాటు గోత్రనామాలతో భక్తుల పేరిట పూజలు చేయించారు. ఆలయంలో ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆదిత్యున్ని దర్శించుకున్న అవినాష్..

వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఒక్కరోజులో దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,72,400, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,60 లక్షలు, విరాళాల ద్వారా రూ.77,300 వరకు ఆదాయం లభించినట్లు ఆలయ వర్గాలు తెలియజేశాయి.

క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రేషన్‌కార్డు అందజేస్తున్న సర్పంచ్, నాయకులు

లావేరు: జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అప్పాపురం పంచాయతీ సర్పంచ్ జగ్గురోతు నాగరత్నం, వైఎస్సార్ సీపీ నేత జగ్గురోతు సత్యానారాయణ అన్నారు. అప్పాపురంలో కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు మంజూరు కావాలంటే నాయకులు చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదని, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



తేజశ్వినిని సన్మానిస్తున్న దళిత సంఘ నాయకులు

రణస్థలం: షెడ్యూల్ కులంలో అత్యధిక మార్కులు సాధించిన దువ్వాన తేజశ్విని ఎంతో మందికి ఆదర్శప్రాయంగా నిలుస్తోందని ఏపీ దళిత మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దేబారి రాము తెలిపారు. రణస్థలం మండలంలో ఎస్సీ కేటగిరీలో 10వ తరగతి ఫలితాల్లో 561 మార్కులు సాధించిన తేజశ్వినికి రణస్థలం ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం దుశ్శాలువతో సత్కరించి రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డి.కుసుమ, దళిత సంఘ నాయకులు సూర్యారావు, కుమార్‌స్వామి, దుప్పాడ సూరిబాబు, సింక శివకుమార్, గుర్ల సింహాద్రి, యండ తమ్ముడమ్మ, అప్పారావు, ప్రసాద్, రాజయ్య, రాము, సీతారాం, శ్రీను, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల నమోదు

లావేరు: మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీఎల్‌వోలు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్లు నిండిన వారి నుంచి ఓటు హక్కు కోసం దరఖాస్తులు తీసుకున్నారు. జాబితాలో మార్పులు, చేర్పులు పోలింగ్ స్టేషన్ల మార్పులు, పేర్లు తప్పుగా నమోదైతే సరిచేసేందుకు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి, డీటీ నారాయణమూర్తి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బాడానకు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



బాడాన దేవభూషణరావుకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: లయన్స్‌క్లబ్ ప్రతినిధిగా, విద్యావేత్తగా, సామాజికవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ బాడాన దేవభూషణరావుకు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చోటు దక్కడం గొప్ప విషయమని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కొనియాడారు. ఆదివారం శ్రీకాకుళంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో దేవభూషణరావును అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, డా.ఎం.కె. మిశ్రో, కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, కోశాధికారి శిల్లా మణి, సభ్యులు జె.భారతి, ఆంజనేయులు, సునీల్, బోగెల ఉమామహేశ్వరరావు, పి.కామేశ్వరరావు, పొడుగు చరణ్, రాజు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ జె.శ్రీనివాసరావు, ఫోరం ఫర్ బెటర్ శ్రీకాకుళం చైర్మన్ గొంద్యాల దుర్గాప్రసాద్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



కరాటే పోటీల విజేతలతో నిర్వాహకులు

శ్రీకాకుళం అర్బన్: క్రీడలతోనే యువత, చిన్నారులకు మానసికోల్లాసం కలుగుతుందని లయన్స్ క్లబ్ జోనల్ అధ్యక్షుడు నటుకుల మోహన్ అన్నారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా మాస్టర్ సాయిబాబా ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో అఫీషియల్ కాలనీలోని అబ్దుల్ కలాం పార్క్‌లో కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక పునరుత్తేజానికి, ఆరోగ్యానికి ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తితో మెలగాలన్నారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో కోచ్‌లు గాయత్రి, చందు, డాక్టర్ రాధ, రవి లక్ష్మణ్, భాస్కర్ పాలొన్నారు.